
సాక్షి
నారాయణపేట
సోమవారం ‌। 18 । డిసెంబర్ । 2023



దెబ్బతిన్న షట్టర్లు
ఊకచెట్టు వాగు ఆనకట్ట షట్టర్లు దెబ్బతిని సాగు నీరంతా వృథాగా పారుతోంది.
వివరాలు 8లో ▸



దళారుల దందా..
కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల పేరిట కొందరు అక్రమ దందాకు తెరలేపారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.3 /19.5
రోజులో చాలావరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

మక్తల్: లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి కక్షిదారుల పరస్పర సమ్మతితో కేసులను పరిష్కరించాలని, ప్రధానంగా రాజీ పడదగిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సిఐ రాంలాల్ తెలిపారు. ఈ నెల 30వ తేది వరకు జాతీయ లోక్‌అదాలత్ ఉంటుందని, క్రిమినల్, సివిల్ కేసులతో పాటు, భూతగాదా, చిట్‌ఫండ్, రోడ్డు ప్రమాద, వివాహ, కుటుంబ తగాదాలకు సంబంధించి కొనసాగుతున్న కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్, క్రాస్‌కంట్రీ ఎంపికలు




మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలతోపాటు క్రాస్‌కంటీ పరుగు పోటీలు నిర్వహించారు. వచ్చేనెల గుజరాత్‌లో జరిగే 19వ జాతీయ అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల పోటీలు, కామారెడ్డిలో ఈ నెల 23న జరిగే రాష్ట్రస్థాయి క్రాస్‌కంటీ పరుగు పోటీల్లో పాల్గొనే జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఈ రెండు ఎంపికలకు జిల్లావ్యాప్తంగా దాదాపు 320 మంది బాల,బాలికలు హాజరయ్యారు. అథ్లెటిక్స్ ఎంపికల్లో అండర్–14కు 60 మీ., లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, అండర్–16కు 60 మీ., 600 మీ., హైజంప్, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, హర్డిల్స్, షాట్‌పుట్ ఎంపికలు నిర్వహించారు. అలాగే జిల్లాస్థాయి క్రాస్‌కంటీలో అండర్- 16 బాలురు, బాలికలకు 2 కి.మీ., అండర్–18 విభాగం బాలురకు 6 కి.మీ., బాలికలకు 4 కి.మీ., అండర్–20 జూనియర్ పురుషులకు 8 కి.మీ., జూనియర్ మహిళలకు 6 కి.మీ., పురుషులు, మహిళలకు 10 కి.మీ., పరుగులో ఎంపికలు నిర్వహించారు.

ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయన్నారు. జిల్లా క్రీడాకారులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయిలో అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న జిల్లాకు చెందిన మహేశ్వరిని ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, ఉపాధ్యక్షుడు రాజేంద్రకుమార్, నర్సింహులు, ఆనంద్‌కుమార్, సాధిక్‌అలీ, సునీల్, రమణ, రమేశ్‌బాబు, శ్రీనివాసులు, బాలరాజు, సత్యనారాయణ, సి.శ్రీనివాసులు, నాయకులు సీజే బెనహర్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు..!





- ఉమ్మడి జిల్లాలోని 44 ఆస్పత్రుల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు
- మెడికల్, సర్జికల్ విభాగాల్లో 1,672 రకాల వ్యాధులకు ఉచిత చికిత్స
- 126 రకాల వాధిగ్రస్తులకు చికిత్స అనంతరం మందుల పంపిణీ
- వైద్య ఖర్చులు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు
- నిరుపేదలకు మేలు చేకూర్చనున్న పథకం

పాలమూరు: పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలంటే ఒకటికి పదిసార్లు ఆలోచించేవారు. దీనికి ఆర్థిక పరిస్థితులే కారణం. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారు. 2006లో పైలెట్ ప్రాజెక్టు కింద మొదటి ఆరోగ్యశ్రీ శిబిరం మహబూబ్‌నగర్‌లోని జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ప్రజలు ఉచితంగా చికిత్స పొందే అవకాశం కల్పించారు. రేషన్‌కార్డులో పేరున్న ప్రతిఒక్కరూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 9 లక్షల కుటుంబాలు ఉండగా 31 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంది. ఉమ్మడి పాలమూరులో ఐదు జిల్లాలు ఉండగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిలో 44 ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు పనిచేస్తున్నాయి. వీటన్నింటిలో 1,672 వ్యాధులకు రూ.10 లక్షల వరకు చికిత్స అందించనున్నారు.

రూ.10 లక్షలకు పెంపు

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభించినప్పుడు రూ.2 లక్షల వరకు ఎలాంటి ఖర్చు లేకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ పథకాన్ని కొనసాగిస్తూ వచ్చారు. ఆరోగ్యశ్రీ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ రెండు పథకాలను కలిపి రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీగా మార్చుతూ ఖర్చు పరిధిని రూ.10 లక్షలకు పెంచి ఈ నెల 9 నుంచి అమలు చేస్తుంది. మొత్తం 1,672 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తుండగా.. ఇందులో మెడికల్ విభాగంలో 289, సర్జికల్‌లో 1,383 వ్యాధులకు రూ.10 లక్షల వరకు చికిత్స పొందవచ్చు. 126 రకాల వ్యాధిగ్రస్తులకు చికిత్స అనంతరం ఏడాది పాటు ఉచితంగా మందులు అందిస్తారు.

ఏయే విభాగాల్లో..

పీహెచ్‌సీల్లో జనరల్ సర్జరీ, గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, అర్థోపెడిక్ సర్జరీ, ప్రొసీడ్యూర్స్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో ఆరోగ్యశ్రీలో వైద్యం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్యంతో వచ్చే నిధుల్లో 30 శాతం ఆస్పత్రి అభివృద్ధికి మిగతా మొత్తాన్ని వైద్యం చేసిన వైద్యులు, సిబ్బందికి ఇతర ఖర్చులకు వాడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు

జిల్లా	ప్రభుత్వ ఆస్పత్రులు	ప్రైవేట్ ఆస్పత్రులు
మహబూబ్‌నగర్	4	15
నారాయణపేట	1	4
నాగర్‌కర్నూల్	8	-
గద్వాల	2	2
వనపర్తి	3	5

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఆరోగ్యశ్రీ చికిత్స వివరాలు

జిల్లా	కేసులు	నగదు (రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	15,008	28.15
నాగర్‌కర్నూల్	3,059	5.08
నారాయణపేట	1,918	4.99
గద్వాల	1,654	2.58
వనపర్తి	470	0.58

సేవలు ప్రారంభం..

ఉమ్మడి జిల్లాలోని 71 పీహెచ్‌సీలతోపాటు 8 అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభమయ్యాయి. అలాగే అర్బన్ హెల్త్‌సెంటర్లతోపాటు పీహెచ్‌సీల్లో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన– ఆరోగ్యశ్రీ పథకం కింద ఈ చికిత్సకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు విడుదల చేస్తోంది. ఈ పథకంలో ప్రతిరోజు రూ.2,100 చొప్పున ప్రతి కేసుకు రూ.10,500 మంజూరవుతాయి. వీటిలో 65 శాతం నిధులు ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, 35 శాతం నిధులు సిబ్బందికి ప్రోత్సాహకంగా అందిస్తారు. పీహెచ్‌సీల్లో మొత్తం 53 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో అందించడానికి జాబితా రూపొందించారు. ఈ పథకం కింద బాధితులకు రూ.5 లక్షల వరకు చికిత్స అందించడానికి వీలవుతుంది. వీటిలో కేంద్రం రూ.3 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు భరిస్తోంది.

పేదలకు ఉపయోగం..



రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పరిమితిని పెంచడం పేదలకు మేలు చేస్తుంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం పేదలకు ఎంతో ఉపయోగకరం. అన్ని రకాల మెడికల్, సర్జికల్‌లలో చికిత్స పొందే వారికి మేలు జరుగుతుంది. అర్హులైన వారు ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉంది. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.
– కృష్ణ, డీఎంహెచ్‌ఓ

కొండంత ఆసరా..



రాజీవ్ ఆరోగశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచడం మాలాంటి వారికి కొండంత అండ. ఇది వరకు గతంలో నా భర్తకు ప్రమాదం జరిగినప్పుడు పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందకపోగా రూ.లక్ష వరకు అప్పు చేసి ఆస్పత్రి బిల్లు చెల్లించా. ఇప్పుడు ఏ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా రూ.లక్షల్లో బిల్లు వేస్తుంది. ప్రభుత్వం పెంచిన ఆర్థిక సహాయం ద్వారా పేద కుటుంబాలకు మేలు జరుగుతుంది.
– లక్ష్మి, వెన్నాచేడ్, మహమ్మదాబాద్ మండలం

ఆస్తులు అమ్ముకోవాలి..



ఇప్పుడు చిన్నపాటి ఆపరేషన్లకే రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. నిరుపేదలు ఆ బిల్లులు చెల్లించాలంటే ఆస్తులు అమ్ముకోవాలి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచడం పేదలకు వరం. కొన్ని ఆస్పత్రుల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఒక్కోసారి అనుమతించడం లేదు. అలా కాకుండా ఏ వైద్యం అయినా తక్షణమే చేసేలా చర్యలు తీసుకోవాలి.
– హన్మంతురెడ్డి, వెంకటొరెడ్డిపల్లి, మహమ్మదాబాద్ మండలం

పింఛన్.. శేష జీవితానికి ఓ గౌరవం



న్యాయమూర్తిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

కోస్గి: ప్రభుత్వం పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందిస్తున్న పింఛన్ అనేది విశ్రాంత ఉద్యోగానికి ఓ గౌరవమని కోస్గి మున్సిఫ్ కోర్టు జడ్జి పర్వీన్ బేగం అన్నారు. జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'పెన్షనర్స్ డే' ను నిర్వహించారు. స్థానిక బసవేశ్వర ఆలయ సమీపంలోని ధర్మశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిఫ్ కోర్టు జడ్జి పర్వీన్ బేగం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెన్షనర్ల ఆత్మగౌరవం కోసం డీఎస్ నకారా సుదీర్ఘ కాలంపాటు సుప్రీం కోర్టులో పోరాడి విజయం సాధించారన్నారు. కోర్టు తీర్పు వెలువడిన రోజును జాతీయ పెన్షనర్ల దినంగా జరుపుకొంటున్నామన్నారు. పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేసే వారి కుటుంబ సభ్యులు శిక్షార్హులని, పెన్షనర్లు సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పలువురు ఎస్టీఓ, బ్యాంకు అధికారులు పెన్షనర్ల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో జడ్జితోపాటు విశ్రాంత ఉద్యోగులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ర్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, ఎస్‌టీఓ అసిస్టెంట్ సుదీర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా



మక్తల్‌లో క్యాంపు కార్యాలయ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు

మక్తల్: తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేందుకు తనవంతు కృషి చేస్తానని.. తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచుతానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం మక్తల్‌లో ప్రజా భవన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆయన, సతీమణి లలిత ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం హోమం వాస్తుపూజ, గణపతిపూజ, హోమం, సరస్వతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు పడమటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. కార్యాలయ ప్రారంభ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అలాగే క్యాలెండర్ల ఆవిష్కరణ, పెన్షనర్ల సన్మానం తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనతోపాటు జెడ్పీచైర్‌పర్సన్ వనజమ్మ, ఎంపీపీ వనజ, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేష్‌కుమార్, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కోళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కలగానే పునరావాసం

- 'అలంపూర్ వరదలపై' అసెంబ్లీలో ప్రస్తావించిన సీఎం
- 2009లో కృష్ణా, తుంగభద్ర నదులకు వరద ప్రళయం
- నీట మునిగిన 32 గ్రామాలు.. సర్వం కోల్పోయిన నిరాశ్రయులు
- 14 ఏళ్ల గడిచినా ఇప్పటికీ నెరవేరని హామీలు
- ఇప్పటికైనా తమను ఆదుకోవాలని బాధితుల వేడుకోలు



రాజోలిలో వరద బాధితుల పునరావాస ఇళ్లు ఇలా..

అలంపూర్: కృష్ణా, తుంగభద్ర నదుల వరద ప్రకోపానికి నదీతీర ప్రాంతాల్లోని 32 గ్రామాలు నీట మునిగాయి.. వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. ఇప్పటికీ నాలుగు ప్రభుత్వాలు.. నలుగురు సీఎంలు మారారు. అయినా వరద బాధితుల సమస్యలు తీరకపోగా.. పునరావాసం సైతం కలగానే మారింది. తమ గోడు వినండని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా అసెంబ్లీలో అలంపూర్ వరదల ప్రస్తావన, పునరావాసంపై చర్చతో వరద బాధితుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయం ప్రస్తావించడంతో పునరావాసం కల నెరవేరుతుందని బాధితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అసెంబ్లీ సమావేశాల్లో చర్చ..

ఈ నెల 15న అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన చర్చలో ప్రభుత్వ తీరుపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయగా సీఎం రేవంత్‌రెడ్డి అలంపూర్ వరద బాధితుల అంశాన్ని ప్రస్తావించారు. గత పదేళ్లలో అలంపూర్ వరద బాధితులకు నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని అందుకే మీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించారని ఘాటు విమర్శలు చేశారు. దీంతో 14 ఏళ్ల చేదు జ్ఞాపకం మరోసారి అసెంబ్లీ సాక్షిగా నెమరు వేసుకున్నట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది.

మారని తలరాతలు

2009 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులు ఉప్పొంగి అలంపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలను వరదలు ముంచెత్తాయి. అప్పటి సీఎం రోశయ్య అలంపూర్‌ను సందర్శించి.. అన్నిరకాలుగా ఆదుకుంటామని, కొత్త అలంపూర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత రాజకీయ పరిస్థితుల్లో సీఎంగా కిరణ్‌కుమార్‌రెడ్డి ఆర్.గార్లపాడులో నిర్మించిన ఒక్క పురావస గృహాలను ప్రారంభించారు. మిగిలిన గ్రామాలను పట్టించుకోలేదు. ఆ తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం, సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టడం జరిగిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చింది. అందులోనైనా అర్హులకు న్యాయం జరుగుతుందని ఆశించారు. కానీ, పదేళ్లలో వరద బాధితులకు ఎలాంటి మేలు చేకూర్చలేదు.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే..

అలంపూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు రాజోలి, తుమ్మలపల్లి, పడమటి గార్లపాడు, తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, నసనూరు, ఆర్.గార్లపాడు, కుట్కనూరు, మద్దూరు గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ గ్రామాలకు పునరావాసం కల్పించాలని అప్పట్లో నిర్ణయించారు. అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రామాలను పునఃనిర్మిస్తామని హామీ ఇచ్చింది. కానీ, నిర్వాసితుల గోడును ఎవరూ పట్టించుకోలేదు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందించిన సహకారంతో ఇటిక్యాల మండలంలోని ఆర్.గార్లపాడు, అయిజ మండలంలోని కుట్కనూరు, రాజోలిలో కొంత మేరకు పునరావసం కల్పించారు. మిగిలిన చోట ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నచందనంగా తయారైంది.

- వరదల్లో నిరాశ్రయులైన రాజోలిలో కొత్త రాజోలి నిర్మాణంలో భాగంగా దాదాపు 212 ఎకరాలను సేకరించారు. అందులో 3,125 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాల కోసం ప్లాట్లుగా మార్చారు. వీటిలో 2,175 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాగా.. 450 అసంపూర్తిగానే ఉన్నాయి.
- తూర్పుగార్లపాడులో 169 ఇళ్లు, తుమ్మిళ్లలో 499, నసనూరులో 290 ఇళ్ల నిర్మాణాలు కొలిక్కి రాలేదు. చేనేత కార్మికులకు ఇళ్లతోపాటుగా మగ్గాల కోసం అదనంగా 750 షెడ్లను నిర్మిస్తామని భరోసా కల్పించారు. ఇప్పటికీ షెడ్ల నిర్మాణాలు చేపట్టలేదు.

ప్లాట్లకే పరిమితం..

వరదల్లో అలంపూర్ పట్టణం దాదాపు 30 రోజులు నీటిలోనే ఉండిపోయింది. నాటి ముఖ్యమంత్రి రోశయ్య స్వయంగా పట్టణాన్ని పరిశీలించి కొత్త అలంపూర్ నిర్మిస్తామని చెప్పడం.. అందుకు అనువుగా దాదాపు 43.27 ఎకరాల భూమిని సేకరించి ప్లాట్లుగా మలిచారు. అయితే, బాధితులకు పట్టాలు పంపిణీ చేసే క్రమంలో అర్హులకు అన్యాయం చేశారంటూ కొందరు ఆందోళనకు దిగడంతో పట్టాల పంపిణీ నిలిపివేశారు. 2023లో ఎన్నికల ముందు కలెక్టర్ ఆదేశాలతో వరద బాధితులకు ఇచ్చిన పట్టాలను వెనక్కి తీసుకొని విచారించారు. మరోసారి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. కానీ, రాజకీయ కారణాలతో పట్టాల పంపిణీ జరగలేదు. ఆ స్థలాలు ఇప్పుడు ముళ్ల పొదలతో నిండాయి. మానవపాడు మండలం మద్దురులోనూ వరద బాధితుల కోసం 32 ఎకరాలను ప్రతిపాదించారు. ఈ సమస్య కొలిక్కిరాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా న్యాయం జరుగుతుందో.. లేదో వేచి చూడాలి మరి.

నావంతుగా కృషిచేస్తా..

వరద బాధితుల ఇళ్ల నిర్మాణానికి నావంతుగా కృషిచేస్తా. గత పాలకులు దీనిపై శ్రద్ధ వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. నిరాశ్రయులకు న్యాయం చేయడానికి ప్రయతిస్తా. వారి తరపున పోరాడతా.
– విజయుడు, ఎమ్మెల్యే, అలంపూర్

మరో ఐదేళ్లు.. ఆహార భద్రత!

- కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం
- రానున్న ఐదేళ్లు పేదలకు అందనున్న ఉచిత బియ్యం
- కరోనా కాలం నుంచి ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ
- జిల్లాలో 1.40 లక్షల కుటుంబాలకు లబ్ధి



రేషన్ బియ్యం కోసం వేలిముద్రలు తీసుకుంటున్న డీలర్

జిల్లా వివరాలిలా..	మున్సిపాలిటీలు	రేషన్ కార్డులు	నెలనెల పంపిణీ చేస్తున్న బియ్యం
గ్రామ పంచాయతీలు : 280	: 3	: 1.40 లక్షలు	: 5,386 మెట్రిక్ టన్నులు
	రేషన్ దుకాణాలు : 323		

కోస్గి: కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకం ద్వారా రేషన్ కార్డుదారులకు కరోనా కష్ట కాలం నుంచి అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్–19 నేపథ్యంలో 2020 మార్చి నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించింది. గతేడాది వరకు విడతల వారిగా ఉచిత బియ్యం పంపిణీ చేస్తూ వచ్చిన కేంద్రం 2022 మార్చి నెలలో ఆరు నెలలు పెంచింది. ఆ తర్వాత మరో మూడు నెలల పాటు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. 2022 చివరి త్రైమాసికం నుంచి కార్డులోని ప్రతిఒక్కరికీ 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించి అమల్లోకి తీసుకువచ్చింది. అప్పటి నుంచి కార్డుదారులందరికి ఒక్కొక్కరికి 6 కిలోల బియ్యం అందుతున్నాయి. ఉచిత బియ్యం పంపిణీకి ఈ నెలతో ప్రభుత్వ గడువు ముగియనుండటంతో మరోసారి 2024 నుంచి ఏకంగా ఐదేళ్లపాటు ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం విశేషం. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రేషన్ కార్డు ఉన్న పేదలందరికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఐదేళ్లపాటు ఉచితంగా రేషన్ బియ్యం అందనున్నాయి.

బియ్యం అక్రమ రవాణాకు చెక్ పడేనా..?

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. పేదల నుంచి చిరు వ్యాపారుల ద్వారా బియ్యం కొనుగోలు చేయించి బియ్యం మాఫీయా పెద్ద ఎత్తున రేషన్ అక్రమ దందా కొనసాగిస్తుంది. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న జిల్లా కావడంతో కోస్గి, మద్దూర్, దామరగిద్ద, నారాయణపేట మీదుగా ప్రతి నెల లారీల్లో పెద్ద మొత్తంలో అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో రేషన్ అక్రమ దందా జోరుగా సాగుతుంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యంతో పేదలకు చేకూరే ప్రయోజనం కంటే అక్రమ బియ్యం మాఫీయాకు జరిగే ప్రయోజనమే ఎక్కువనే వాదనలు ఉన్నాయి. అధికారులు అక్రమ రేషన్ బియ్యం దందాను అడ్డుకుంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

1.40 లక్షల కుటుంబాలకు అందనున్న బియ్యం..

జిల్లాలోని 13 మండలాల పరిధిలో మొత్తం 323 రేషన్ దుకాణాల ద్వారా 1,40,217 రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఐదేళ్లపాటు ఉచిత బియ్యం అందనున్నాయి. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెల 5,386 మెట్రిక్ టన్నుల బియ్యంను ఉచితంగా అందజేస్తుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో జిల్లాలో 1.40 లక్షల కుటుంబాలకు ఉచితంగా రేషన్ బియ్యం అందనున్నాయి.




రేషన్ షాపులో బియ్యం తూకం వేస్తూ..

కేంద్ర నిర్ణయంతో పేదలకు మేలు




నాలుగేళ్లుగా పేదలకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' పథకం ద్వారా ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుంది. ఈ పథకాన్ని మరో ఐదేళ్లు పొడిగించడంతో ఎందరో పేదలకు మేలు కలుగుతుంది. కరోనా కాలం నుంచి పేదలకు ఉచిత బియ్యం అందిస్తూనే మరో ఐదేళ్లు పొడిగించడం ఎంతో హర్షనీయం.
– రాంబాబు, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



ఉచిత బియ్యం పంపిణీ విధానం పొడిగించడం మంచి పరిణామం అయినప్పటికి అధికారులు పర్యవేక్షిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుంది. రేషన్ బియ్యం అక్రమ దందాను అడ్డుకుంటేనే పేదలకు న్యాయం జరిగి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. రేషన్ దుకాణాల్లో నిజమైన పేద లబ్ధిదారులకే బియ్యం పంపిణీ చేపట్టాలి. – డీకే రాములు, కోస్గి

ఆదేశాలు రాలేదు



ఆహార భద్రత పథకం పొడిగింపు విషయంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు రావాల్సి ఉంది. గతంలో వచ్చిన ఆదేశాల ప్రకారం ఈ నెలతో ఉచిత బియ్యం పంపిణీ గడువు ముగుస్తుంది. మరో ఐదేళ్లు ఈ పథకాన్ని అమలు చేస్తారనే మౌఖిక సమాచారం ఉంది. అధికారిక ఆదేశాలు రాగానే ఉచిత బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేస్తాం.
– సుదర్శన్, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


యుగేందర్ (ఫైల్)

అయిజ: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మప్ప, గోవిందమ్మ దంపతులు పట్టణంలోని రజక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వారు ఇళ్లు నిర్మించుకుంటున్నారు. పెద్ద కుమారుడు యుగేంధర్ (32) ఆదివారం నిర్మాణ దశలో ఉన్న గోడలకు నీళ్లు చల్లేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నీటి సంపులో పడి చిన్నారి..

జడ్చర్ల: ఇంటి ఆవరణలోని నీటి సంపులో చిన్నారి పడి మృతి చెందిన ఘటన ఆదివారం స్థానిక కావేరమ్మపేటలో చోటు చేసుకుంది. కావేరమ్మపేటకు చెందిన గందు వినోద్, పుష్పమాల కూతురు రియాన్సిక(2) ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. కొద్దిసేపటి తర్వాత తమ కూతురు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. చివరకు నీటి సంపులోకి తొంగి చూడగా చిన్నారి కనిపించడంతో బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందింది. ఒక్కగానొక్క కూతురు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

అచ్చంపేట రూరల్: అమ్రాబాద్ మండలం ఈదులబావికి చెందిన మోటమోని రాజు (55) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ గోవర్ధన్ వివరాల మేరకు.. ఈనెల 10న అచ్చంపేటలోని ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సులో మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారుగొలుసు చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. బిజినేపల్లి మండలం పోలేపల్లికి చెందిన అలివేలమ్మ ఆర్టీసీ బస్సులో నాగర్‌కర్నూల్‌కు వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి 3తులాల బంగారు గొలుసును లాక్కెల్లారు. అలివేలమ్మ జిల్లా కేంద్రానికి చేరుకున్న తర్వాత గొలుసును చూసుకోగా లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: వెల్దండ మండలం కొట్రగేట్ వద్ద శనివారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతికి కారణమైన కారు డ్రైవర్ రుక్మాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన కొరివి రాకేష్ బైక్‌పై వస్తుండగా.. కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రాకేష్ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించాడని యువకుడిపై దాడి

మహమ్మదాబాద్: యువతితో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న నెపంతో యువకుడిని చితకబాదిన వారిపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే మండలంలోని కప్లాపూర్ చెందిన మీర్జాపురం శేఖర్ కుటుంబీకులు అందరూ మహారాష్ట్రలో పూణెలో నివాసం ఉంటున్నారు. శేఖర్ గ్రామంలో ఇల్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా దయాదులతో ఇంటి స్థలం విషయంలో అప్పుడప్పుడు గొడవలు అవుతున్నాయి. ఇదే క్రమంలో పథకం ప్రకారం యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ తిరుపతయ్య, ఆయన కుమారులు మురళీ, గణేష్, అంజిలయ్య, కృష్ణ, విగ్నేష్ కలిసి శేఖర్‌ను చితకబాదారు. దీంతో బాధితుడి తండ్రి హనుమంతు ఫిర్యాదు మేరకు ఆదివారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

బావపై బామ్మర్దుల దాడి

ఉండవెల్లి: సొంత బావను బామ్మర్దులు దాడి చేసిన ఘటనలో ఆదివారం ముగ్గురిపై కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొంకూరుకు చెందిన బోయ తిరుమలేష్, స్రవంతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇటీవల వారిద్దరికి మనస్పార్థాలు రావడంతో స్రవంతి పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో పెద్దమనుషుల వదద పంచాయితీ చేశారు. కాగా తిరుమలేష్ పొలానికి వెళ్లే క్రమంలో స్రవంతి తమ్ముడు నరేష్ దూషించి తిరుమలేష్‌పై దాడి చేశాడు. తిరుమలేష్ విషయం తండ్రి పెద్ద అయ్యన్నకు చెప్పగా, వారిద్దరు కలిసి పోలీస్‌స్టేషన్ వెళ్తుండగా బామ్మర్దులు దేవేందర్, నరేష్, అత్త గోపాలమ్మ వారిపై దాడి చేశారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

దెబ్బతిన్న షటర్లు..

- మరమ్మతులకు నోచుకోని ఊకచెట్టువాగు గేట్లు
- నాసిరకంగా కాల్వల నిర్మాణం
- ఆందోళన చెందుతున్న రైతులు


ఊకచెట్టువాగుపై ఆనకట్ట వద్ద ధ్వంసమైన తూము షట్టర్లు

చిన్నచింతకుంట: దేవరకద్ర మండలం మీనిగోనిపల్లి సమీపంలో ఊకచెట్టువాగుపై నిజాం కాలంలో ఆనకట్టను నిర్మించారు. ఆనకట్ట వద్ద తూములను ఏర్పాటు చేసి కాల్వ ద్వారా ప్రతి సంవత్సరం చిన్నచింతకుంట మండలంలోని ముచ్చింతల, అప్పంపల్లి, తిర్మలాపూరం, గూడూర్ గ్రామాల గొలుసు కట్టు చెరువులకు నీటిని తరలిస్తారు. అయితే ఆనకట్ట వద్ద తూములు ధ్వంసమయ్యాయి. గొలుసుకట్టు చెరువుల కాల్వకు పలు చోట్ల గండ్లు ఏర్పడ్డాయి. దీంతో చెరువులకు నీరు చేరకుండా వృథాగా వాగులోకి పోతుంది. భూగర్భ జలాలు అడగంటి బోరు బావులు వట్టిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఆనకట్ట వద్ద సుమారు కిలో మీటర్ మేర నీరు నిల్వడంతో ఆనకట్ట పరిసర ప్రాంతాలలోని గ్రామాల రైతులు 500 ఎకరాలలో పంటలు సాగు చేసుకునేవారు. అంతేకాక గొలుసు కట్టు చెరువుల కింద 2వేల ఎకరాలను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. నీరు వృథాగా పోయి పంటలు ఎండే పరిస్థితులు దాపురించాయని అప్పంపల్లికి చెందిన రైతులు, మత్స కార్మికులు కాల్వకు ఏర్పడ్డ గండ్లను పూడ్చి చెరువులకు నీటిని తరలించుకునేందుకు సిద్ధమయ్యారు. కాల్వకు రాళ్లు, మట్టి పోసి గండ్లు పూడ్చుతున్నారు. ఇంత చేస్తున్నా అధికారులు అటువైపు చూడకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వ మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మకై పనులు నామమాత్రరంగా చేపట్టారని రైతులు ఆరోపిస్తున్నారు.


కాల్వకు పడిన గండ్లను పూడ్చుతున్న రైతులు (ఫైల్)

కాల్వ పనులు చేపట్టాలి



కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నాలుగేళ్లు గడుస్తుంది. అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికి మరమ్మతులకు నోచుకోవడంలేదు. కాల్వకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చేందుకు రైతులు, మత్స్యకార్మికులు ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు. కాల్వ నీరు చెరువులకు చేరకుండా వృథాగా వాగులోకి పోతున్నాయి.
– సీతన్న, అప్పంపల్లి, మత్స్య కార్మికుడు

తూముల మరమ్మతు చేపట్టాలి



లాల్‌కోట, మీన్‌గోనిపల్లి మధ్య ఊకచెట్టువాగు పైన ఉన్న ఆనకట్ట తూములకు షటర్లు ధ్వంసమై నీరంతా వృథాగా కిందకు పోతుంది. ఈ ఆనకట్ట వద్ద దాదాపుగా కిలోమీటర్ మేర నీరు నిలిచి లాల్‌కోట, మీన్‌గోనిపల్లి, బంద్రపల్లి, గుడిబండలో భూగర్భజలాలు పెరిగి బోరుబావులలో నీరు అందుతుంది. దీంతో పరిసర ప్రాంతలలో ప్రతి సంవత్సరం 500 ఎకరాలలో రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తూముల ద్వారా నీరంతా వృథాగా పోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఈ యాసంగి పంటలకు నీరందక పంటలు ఎండే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తూముల మరమ్మతు చేపట్టాలి.
– అంజన్న, రైతు, లాల్‌కోట

మరమ్మతు చేపడుతాం

ఆనకట్టవద్ద ఉన్న తూ ములను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి ఉంటారు. వాటిని త్వరగా మరమ్మతు చేయిస్తాం. అలాగే ఫీడర్ చానల్ కాల్వ పనులను చేపట్టి చెరువులను నీటితో నింపుతాం. – గోపాలచారి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ

నాసిరకంగా పనులు

ఊకచెట్టువాగుపై నిర్మించిన ఆనకట్ట, తూములు, కుడి కాల్వకు ముచ్చింతల నుంచి గూడూర్ వరకు 15 కిలో మీటర్లు పొడవున 5 మీటర్లు వెడల్పు చేస్తూ ఫీడర్ చానల్, కాంక్రీట్ పనులు చేపట్టేందుకు 2018లో రూ.2.80 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను చేపట్టి గొలుసుకట్టు చెరువులకు నీటిని నింపుతూ కాల్వల ద్వారా పంటపొలాలకు అందించాల్సి ఉంది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మకై ఆనకట్ట, తూములకు షటర్లను నామమాత్రంగా అమర్చారు. ఫీడర్ చానల్ కాల్వ మరమ్మతు అంతంత మాత్రంగా చేపట్టారు. కాంక్రీట్‌తో ఎక్కడా నిర్మించచలేదు. దీంతో కాల్వకు గండ్లు పడుతూ ఆయా గ్రామాల చెరువులకు నీరు అందడం లేదు. ఆనకట్ట తూము సమీపంలో పలు చోట్ల కాల్వలకు గండ్లుపడ్డాయి. అక్కడక్కడ చేపట్టాల్సిన కాంక్రీట్ పనులు చేపట్టలేకపోయారు. వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు రైతులు సాగు చేసిన పంటపొలాలు కొట్టుకపోయి, తీవ్రనష్టం వాటిల్లుతుంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆలయాల సంరక్షణ ఏది?

- కార్తీక దీపాలతో పొగబారిన నవబ్రహ్మ ఆలయాలు
- దెబ్బతింటున్న రాతి కట్టడాలు
- పట్టించుకోని కేంద్ర పురావస్తుశాఖ
- తమ పరిధి కాదంటున్న దేవాదాయశాఖ

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లోని అపూర్వ కట్టడాలైన నవబ్రహ్మ ఆలయాల్లో భక్తులు కార్తీక మాసంలో రోజు దీపాలు వెలిగించడంతో రాతి కట్టడాలు మసిబారిపోయాయి. వీటితో పాటు ఆలయం చుట్టూ ఉన్న దేవతా మూర్తుల ఉప ఆలయాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొందరు భక్తులు ఏకంగా శివుడి పాణవట్టంపై దీపాలు వెలిగిస్తున్నారు. ఈ విషయాన్ని ఆలయ అధికారుల వద్ద ప్రస్తావించగా.. బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ ఆలయం మాత్రమే దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయని.. మిగిలిన ఆలయాలు కేంద్ర పురావస్తుశాఖ పరిధిలో ఉండటంతో వాటి సంరక్షణ బాధ్యత వారిదేనన్న జవాబిస్తున్నారు. తమ పరిధిలోని ఆలయాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పర్యవేక్షిస్తున్నామని చెబున్నారు.

అపరిశుభ్రంగా మారిన ఆలయాలు..

పురాతన కట్టడాలను సంరక్షించాల్సిన పురావస్తుశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారు.


గరుడబ్రహ్మ ఆలయంలో పాణవట్టంపై దీపాలు వెలిగిస్తున్న భక్తుడు

రోజువారి వేతనంతో పనిచేసే ఉద్యోగులతో పాటు తాత్కాలిక ఉద్యోగులు ఉన్నప్పటికీ అటు ఆలయాలు, ఇటు రాతి కట్టడాలను సంరక్షించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కార్తీక మాసం ముగిసి ఆరురోజులు కావస్తున్నా ఆలయాలు, పరిసరాల్లో నూనె జిడ్డు పేరుకుపోయి అపరిశుభ్రంగా తయారయ్యాయి. అలాగే ఆలయాల్లో భక్తులు టెంకాయలు కొట్టి నీరు అలాగే వదిలేయడంతో అవన్నీ కుళ్లి దుర్వాసనను వెదజల్లుతున్నాయి. కేంద్ర పురవస్తుశాఖ, దేవాదాయశాఖ అధికారుల సమన్వయం లోపంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా స్పందించి పురాతన ఆలయాల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

6 క్వింటాళ్ల మిర్చి ఎత్తుకెళ్లిన దుండగులు


మొక్కను చూపుతున్న రైతు

అమరచింత: చేతికొచ్చిన మిరప తోటలో గుర్తు తెలియని దుండగులు పండు మిర్చిని ఎత్తుకెళ్లిన ఘటన పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. పట్టణానికి చెందిన విష్ణువర్ధన్‌యాదవ్ తన ఐదు ఎకరాల్లో మిరప తోటను సాగు చేశాడు. ఎకరం సాగుకు రూ.లక్ష ఖర్చు పెట్టి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. బాగా కాపు కాసిందని కాయలు పండుగా మారుతున్నాయని ఆశపడ్డా రైతు ఆశలు ఆవిరైపోయాయి. పది రోజులుగా రాత్రి వేళలో పొలానికి వెళ్లలేదని, పత్తి అమ్మకం పనిలో ఉన్నానని బాధిత రైతు తెలిపారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా పండు మిరప కాయలన్నీ కనిపించలేదని మొక్కలను పరిశీలించగా మిరపను కోసుకెళ్లారని తెలిపారు. పట్టణ శివారులోని తూక్యానాయక్ తండా, భీమా కాల్వ సమీపంలో ఉన్న మిరపతోటలో ఎవరో వారం రోజులుగా రాత్రివేళలో చొరబడి మిరప పండు కాయలను ఎత్తుకెళ్లినట్లు రైతు తెలిపారు. సుమారు రూ.1.30లక్షల నష్టం వాటిల్లినట్లు వాపోయారు.

శీతాకాలంలో.. సస్యరక్షణతోనే దిగుబడి


కంది పంట

అలంపూర్: పంటల్లో సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. సాగు చేసిన పంటకు శీతాకాలంలో వచ్చే వివిధ రకాల చీడ పీడలు, తెగుళ్ల గురించి ఏడీఏ ఈ విధంగా వివరిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

కంది

కందిలో మారుకా మచ్చల పురుగు ఆశిస్తుంది. దీన్నే బియ్యపు పురుగు అని కూడా అంటారు. ఈ పురుగు లేత ఆకులను, మొగ్గలను, పూతలను చుట్టలుగా చేసి లోపల నుంచి వాటిని తినేస్తుంది. దీని వల్ల పంట దిగుబడి ఘణనీయంగా తగ్గుతుంది. కాయ అడుగు భాగాన్ని చిన్న రంధ్రాన్ని చేసుకుని గింజలను తింటాయి. కాయ లోపల కూడా చుట్టలతో ఉండటం వలన పురుగు మందు ప్రభావం నుంచి తప్పించుకుంటుంది.

నివారణ

పంట మొగ్గ దశలో ఉన్నప్పుడు వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. దీని వలన తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా ఉంటుంది. ఒక వేళ ఏవైన గుడ్లు పెట్టినా అవి పొదగవు. పురుగు నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోడికార్బ్ 1.5 గ్రాములు లేదా నువాలురాన్ ఒక మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వీటితోపాటు నువాన్ ఒక మి.లీ. లీటరు నీటికి కలిపి తప్పకుండా పిచికారి చేసుకోవాలి. నువాన్ మందుకు ఆవిరయ్యే గుణం ఉంది కాబట్టి అది లోనికి చొచ్చుకెళ్లి పురుగును చంపుతుంది.

పచ్చ పురుగు

పచ్చ పురుగు తల్లి రెక్కల పురుగు లేత మొగ్గలపై పూతపై బంగారం రంగులో ఒక్కొక్కటిగా గుడ్లు పెడతాయి. ఈ గుడ్ల నుంచి పొదిగిన పురుగులు ఆకులను, పూతను, మొగ్గను, కాయలను తిని పంటను పూర్తిగా నాశనం చేస్తాయి.

నివారణ

ఈ పురుగు నివారణకు నువాలురాన్ ఒక మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ ఒక గ్రాము లేదా ఫ్లూబెండమయిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

ఎండు తెగులు

ఈ తెగులు భూమిలో ఉండే శిలీంద్రం వలన వ్యాపిస్తుంది. ఫుజేరియం శిలీంద్రం ఎండు తెగులును కలగజేస్తుంది. ఈ శిలీంద్రము యొక్క మొక్క వేరును ఆశించి లోనికి వెళ్లి నీటి లవణాలను సరఫరా చేసే కణజాలాన్ని మూసి వేస్తుంది. దీని వలన వేరు అక్కడక్కడ లావుగా మారుతుంది. ఈ తెగులు సోకిన మొక్కలు మొదట ఆకులు వడలపోయి తర్వాత పూర్తిగా ఎండిపోతాయి.

నివారణ

ఈ తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి అనే శిలీంద్ర నాశిని 8 గ్రాములు ఒక కిలో విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలి. లేదా బావిస్టిన్ ఒక గ్రాము లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదలల్లో పది రోజుల వ్యవధిలో రెండు సార్లు వేసుకోవాలి.

అలంపూర్ ఆలయాలను అగ్రగామిగా నిలుపుదాం


సీఎం రేవంత్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్: రాష్ట్రంలోనే ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ సంపత్‌కుమార్, జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఆశీర్వచనం పలికి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి వారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు. ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి క్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, యాత్రికులకు కల్పించాల్సిన వసతుల గురించి సీఎం సంపత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే జోగుళాంబ ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకుంటామని సీఎం చెప్పారని వారు వివరించారు. ఆలయ అభివృద్ధి గురించి దేవాదాయ, పర్యాటక, పురాతత్వ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తానని భరోసా ఇచ్చినట్లు చెప్పారు.

అన్నదాత ఆశలపై నీళ్లు!


నీళ్లు లేక ఎండిపోయిన కల్వకుర్తిలోని కేఎల్ఐ కాల్వ

- ఎంజీకేఎల్ఐ కాల్వలకు నిలిచిన నీటి విడుదల
- ప్రశ్నార్థకంగా మారిన వేరుశనగ సాగు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

కల్వకుర్తి: మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎంజీకేఎల్ఐ) అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతోంది. కాల్వ నీళ్లను నమ్ముకుని పంట సాగు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. అటు కాల్వల్లో సాగునీరు రాక.. ఇటు బోరుబావుల్లో నీటి మట్టం పడిపోవడంతో పంటసాగు ప్రశ్నార్థకంగా మారింది. కేఎల్ఐ కాల్వల ద్వారా సాగునీరు వస్తుందన్న ఆశతో రైతులు వేరుశనగ పంట సాగుచేశారు. పంట చేతికొచ్చే సమయంలో కేఎల్ఐ కాల్వలకు నీటి విడుదల నిలిచిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వ్యయప్రయాసలకోర్చి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

90వేల ఎకరాల్లో వేరుశనగ సాగు..

జిల్లాలో దాదాపు 90వేల ఎకరాలలో వేరుశనగ సాగు చేశారని వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 1.20 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేయగా.. ఈ ఏడాది సకాలంలో వర్షాలు లేకపోవడం, కాల్వ నీళ్లు రావన్న భయంతో చాలా మంది రైతులు వేరుశనగ సాగు చేయలేదని తెలుస్తోంది. ప్రస్తుతం పంట సాగు చేసిన రైతుల్లో దాదాపు 80 శాతం వరకు కేఎల్ఐ నీటినే నమ్ముకున్నారు. వీరిలో చాలా మంది పొలాన్ని కౌలుకు తీసుకొని పంటసాగు చేశారు. ప్రస్తుతం కాల్వలకు నీటి విడుదల నిలిచిపోవడంతో పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

నెలరోజులు అయితే పంట చేతికి..

కేఎల్ఐ కాల్వలకు నీటి పంపింగ్ నిలిచిపోయి 10 రోజులు దాటింది. దీంతో రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో నెలరోజులు కాల్వల ద్వారా నీరు వస్తే పంటలు చేతికొచ్చేవని రైతులు చెబుతున్నారు. కాగా.. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున బోరుబావుల ఆధారంగా వేరుశనగ పంట సాగు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచించారు. అధికారుల సూచనలను కొందరు లెక్క చేయకుండా వేరుశనగ పంట సాగుచేశారు. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో కాల్వలకు నీటి విడుదల నిలిచిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఏదేమైనా మరో నెలరోజులు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

నీళ్లు రాకపోతే అధోగతే..



కాల్వలే ఆధారంగా చేసుకుని వేరుశనగ పంట సాగుచేశాం. ప్రస్తుతం నీటిని నిలిపివేయడంతో ఏం చేయాలో తెలియడంలేదు. కిలోమీటర్ల మేర చాలా మంది రైతులు పైపులైన్లు వేసుకున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కాల్వల ద్వారా మరో 15 రోజులు నీటిని విడుదల చేయాలి.
– గోవర్ధన్‌రెడ్డి, రైతు, కల్వకుర్తి

యువకుడిపై దాడి: ఏడుగురిపై కేసు

ఉండవెల్లి: చాటింగ్‌లో పరిచయం పెంచుకుని, యువకుడితో ఓ వివాహిత భర్తను వదిలేసి వెళ్లిపోయింది. దీంతో వారు తిరిగి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న వివాహిత భర్త, మరో ఆరుగురు వారిని పట్టుకుని చితకబాదిన ఘటన పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ఈరన్న తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లా కోవెలకుంట్లకు చెందిన ఇంద్రవతి, అయిజకు చెందిన హరీష్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంతానం లేదు. కాగా ఇంద్రవతికి ఆన్‌లైన్ చాటింగ్ ద్వారా కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన హరిచరణ్‌తో పరిచయం పెరిగింది. పరిచయం ప్రేమగా మారడంతో వీరిద్దరు ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌కు పరారయ్యారు. వీరు తిరిగి ఆదివారం కర్నూల్‌కు వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న వివాహిత భర్త హరీష్, ఆరుగురు మిత్రులతో కలిసి పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వారి వాహనాన్ని అడ్డుకుని కర్రలతో దాడి చేశారు. ఘటనలో హరిచరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు చేరుకుని వివాహితను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా, హరిచరణ్‌ను కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హరిచరణ్ తండ్రి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


శివకుమార్‌గౌడ్

ఆత్మకూర్: ద్విచక్ర వాహనం ఎద్దులబండిని ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ కథనం మేరకు.. భూత్పూర్ మండలం జమిస్తాపూర్‌కు చెందిన శివకుమార్‌గౌడ్ (21) కొంతకాలంగా మండలంలోని పిన్నంచర్లలో బంధువుల ఇంట్లో ఉంటూ పట్టణంలోని ఓ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి విధులు ముగించుకొని పిన్నంచర్లకు వెళ్తుండగా.. పద్మావతి గార్డెన్స్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఎద్దులబండి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడని ఎస్ఐ వివరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త బైక్ కొని అంతలోనే..

- కారు ఢీకొని అక్కడికక్కడే వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరోవ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గండేడ్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. వెన్నాచేడ్‌కి చెందిన మైసగళ్ల గోపాల్ (34) స్థానికంగా మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొత్తబైక్ కొనాలనుకున్నాడు. ఆదివారం ఉదయం కోస్గికి వెళ్లి షోరూంలో బైక్ తీసుకున్నాడు. పర్వతాపురం మైసమ్మ దగ్గరికి వెళ్లి పూజలు చేయించాడు. స్వగ్రామానికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో గండేడ్ వద్ద ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొంది. ఘటనలో గోపాల్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై వెనుకాల ఉన్న మరో వ్యక్తి కిష్టయ్యకు సైతం తీవ్రంగా గాయాలయ్యాయి. కాగా స్థానికులు 108లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు, కుటుంబీకులకు సమాచారం అందించారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

తిరుమల: ధనుర్మాసం ప్రారంభం కావడంతో తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. జనవరి 14వ తేదీ వరకు ఈ తిరుప్పావై పారాయణం కొనసాగనున్నది. ఆదివారం తెల్లవారుజామున 12.34 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభమయ్యాయి. తిరుమల పెద్దజీయర్ మఠంలో తిరుప్పావై పారాయణం ఆదివారం ప్రారంభమైంది. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి పాల్గొని మంగళాశాసనాలు అందించారు. శ్రీవారి ఆలయ పరిచారక కేతః లక్ష్మీనరసింహన్ తిరుప్పావై ప్రవచనం వినిపించారు. మొదటి రోజు రెండు పాశురాలను పారాయణం చేశారు. తిరుమల ఆస్థాన మండపంలో హైదరాబాద్‌కు చెందిన వేదాంత విద్వాంసులు గోవర్ధనం స్వామినాథాచార్యులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాల్లో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక రూ.25లక్షల వరకు 'ఆరోగ్యశ్రీ'

నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీలో పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన ఉచిత కార్పొరేట్ వైద్యం అందించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో గొప్ప మైలురాయికి శ్రీకారం చుడుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరిన్ని మెరుగులు దిద్దుతూ దానిని మరింత బలోపేతం చేసే కార్యక్రమాన్ని ఆయన సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద ఇక నుంచి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమంతోపాటు సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల జారీని కూడా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభిస్తారు. అలాగే, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించడం.. దాని ద్వారా ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడికి వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలనే సందేహాలన్నింటినీ ప్రతిఇంట్లో నివృత్తిచేసే కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఇక కొత్త కార్డుల పంపిణీ సందర్భంగా ప్రతీ ఇంట్లో కనీసం ఒకరి ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, మహిళా పోలీసులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు స్వయంగా చూస్తారు.

ఓట్ల.. కేటుగాళ్లు

ఉనికి కోసం టీడీపీ సానుభూతిపరులతో బాబు బోగస్ వేషాలు

తెలంగాణలో నివాసం, ఓటు.. ఏపీలోనూ ఓటర్లుగా నమోదు

- పోలింగ్ ముగిసిన మర్నాడే హైదరాబాద్‌లో టీడీపీ నేతల మేళా
- సానుభూతిపరులతో శిబిరాలు.. ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున ఫామ్ 6 దరఖాస్తులు
- ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయాలంటూ లక్షల సంఖ్యలో అప్లికేషన్లు
- ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ఓట్లు కలిగి ఉండటం చట్ట ప్రకారం నేరం
- ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి.. అక్రమాలకు పాల్పడుతున్న టీడీపీ
- బాబు చూపిన బాటలోనే నడుస్తున్న జనసేన
- పవన్ సోదరుడు నాగేంద్రరావు, కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లో ఓట్లు
- తామంతా వడ్డేశ్వరంలో నివాసం ఉంటున్నామంటూ మళ్లీ ఓటు కోసం దరఖాస్తు
- హైదరాబాద్‌లో ఓట్లున్న 4.30 లక్షల మందికి ఏపీలోనూ ఓట్లు..



వాట్సాప్‌లో టీడీపీ పంపించిన సందేశం

సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లోనూ 2019కి మించి ఘోర పరాజయం తప్పదని నిర్ధారణకు వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఓటమికి ఇప్పట్నుంచే సాకులు వెతుక్కుంటున్నారు. ఒకవైపు ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయంటూ ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెడుతున్న ఆయన మరోవైపు నిబంధనలను కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ యథేచ్ఛగా దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 17, 18 ప్రకారం దేశంలో ఒక నియోజకవర్గంలో ఒక వ్యక్తికి ఒక ఓటు మాత్రమే ఉండాలి. వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు నమోదు చేయించుకోవడం చట్ట ప్రకారం నేరం. రాజకీయాల్లో 1978 నుంచి ఉన్న చంద్రబాబుకు ఇది తెలిసినా తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారు. తెలంగాణలోనూ, ఏపీలోనూ రెండు చోట్లా ఓట్లు ఉన్న వారు (డూప్లికేట్లు) 4,30,264 మంది ఉన్నారు. కర్ణాటక, తమిళనాడు, ఒడిశాలో నివాసం ఉంటూ అక్కడ ఓటర్లుగా ఉన్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరుల పేర్లను ఏపీలోనూ సరిహద్దు నియోజకవర్గాల్లో చేర్పించారు. వాటిని తొలగించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించాలని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పరిశీలకులు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణలో పోలింగ్ ముగిసిన మర్నాడే..

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్ నవంబర్ 30న పూర్తయింది. ఆ మరుసటి రోజే అంటే డిసెంబర్ 1 నుంచే హైదరాబాద్‌లో ఓటర్లుగా ఉన్న టీడీపీ సానుభూతిపరులను ఏపీలోనూ ఓటర్లుగా చేర్పించేందుకు ఆ పార్టీ భారీ ఎత్తున శిబిరాలు నిర్వహించింది. కూకట్‌పల్లి, నిజాంపేట, వనస్థలిపురం, మణికొండ, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో శిబిరాల ఇన్‌ఛార్జ్‌లను నియమించిన టీడీపీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ ఓటర్లుగా చేర్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ సానుభూతిపరులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. వయసు, చిరునామా ధ్రువీకరించే ఆధార్ కార్డును వాట్సప్‌లో పంపితే తామే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేయిస్తామని, ఎన్నికల సంఘానికి తామే ఫారం 6 సమర్పిస్తామంటూ సందేశాలు పంపింది. టీడీపీని భుజానికెత్తుకునే మోసే ఓ సామాజిక వర్గం నాయకులు ఈ ప్రచారంలో ప్రధాన భూమిక పోషించారు. ఇలా హైదరాబాద్, తెలంగాణలో నివాసం ఉంటున్న లక్షల మంది టీడీపీ సానుభూతిపరులను ఏపీలోని పలు నియోజకవర్గాల్లో ఓటర్లుగా చేర్చేందుకు ఫారం 6 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఇప్పటికే సమర్పించారు. ఈ ప్రక్రియను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

> ప్రజాస్వామ్యమంటే... ప్రజల చేత.. ప్రజల కోసం.. ప్రజలే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం. ప్రజలే ప్రభువులు!
> ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఓటూ కీలకమే. ఒకే ఒక్క ఓటు గెలుపోటములను నిర్దేశిస్తుంది. కేవలం ఒకే ఒక్క ఓటు అభ్యర్థుల తలరాతలను మార్చేస్తుంది.
> ఓటర్ల జాబితా ఎంత పారదర్శకంగా ఉంటే ప్రజాతీర్పు అంత స్పష్టంగా ఉంటుంది. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.
> ప్రజల ఆశీస్సులతో కాకుండా.. అడ్డదారుల్లో అధికారం కోసం అర్రులు చాచే వ్యక్తిని ఏమంటారు? కేటుగాడనే కదా!
> ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి దొంగదారిలో అధికారాన్ని దక్కించుకున్న చంద్రబాబు నాటి నుంచి ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడుతూ 'డూప్లికేటు' వేషాలు వేస్తున్నారు!

పవన్ కుటుంబం బరి తెగింపు..

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అనే తరహాలో డూప్లికేటు ఓట్లు చేర్చడంలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా అదే బాట పట్టారు. ఆయన సోదరుడు కొణిదల నాగేంద్రరావుకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్ నెంబరు 168లో సీరియల్ నెంబరు 323 ఎఫ్‌వైవై 6038202 ఓటరు కార్డు నెంబరుతో ఓటు ఉంది. నాగేంద్రరావు సతీమణి పద్మజ కొణిదలకు సీరియల్ నెంబరు 324, వారి కుమారుడు కొణిదెల సాయివరుణ్ తేజ్‌కు సీరియల్ నెంబరు 325తో అక్కడ ఓట్లున్నాయి. తెలంగాణ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజే అంటే డిసెంబరు 4న ఏపీలోనూ ఓటు హక్కు కోసం వారు దరఖాస్తు చేసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని రాధారంగా నగర్ మూడో వీధి 5-263 డోర్ నెంబర్ ఇంటిలో తాము నివాసం ఉంటున్నామంటూ కొణిదల నాగేంద్రరావు, పద్మజ, సాయివరుణ్ తేజ్ ఓటర్లుగా నమోదు కోసం ఫారం 6 దరఖాస్తు సమర్పించడం గమనార్హం. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసమే జనసేనను స్థాపించిన సినీనటుడు పవన్ కళ్యాణ్ తాజాగా మరోసారి జత కట్టడం ద్వారా దీన్ని రుజువు చేసుకున్నారని రాజకీయ విశ్లేషకులు, మేధావులు, ప్రజాసంఘాలు స్పష్టం చేస్తున్నాయి. 2014 ఎన్నికల్లో పోటీ చేయకుండా చంద్రబాబుకు బేషరతుగా మద్దతు తెలిపిన పవన్ కళ్యాణ్ 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం ద్వారా టీడీపీకి మేలు చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రయత్నించారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పవన్ ఇంటికి చంద్రబాబు

- లోక్‌సభ ఎన్నికల్లో జనసేనతో పొత్తు ఉండదన్న బీజేపీ నేత కిషన్‌రెడ్డి
- టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు ఉంటుందని పలుమార్లు చెప్పిన పవన్
- కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళంలో ఇరు పార్టీలు
- దీంతో పవన్ వద్దకు వెళ్లి చర్చలు జరిపిన చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. పవన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇటీవలి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – జనసేన ఉమ్మడిగా పోటీ చేసిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రెండు రోజుల కిత్రం ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఏపీలో టీడీపీ, జనసేన పొత్తుకు బీజేపీ కూడా కలిసి వస్తుందని పవన్ గతంలో పలుమార్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు కిషన్‌రెడ్డి ప్రకటనతో గందరగోళం ఏర్పడింది. దీనిపైనా పవన్, చంద్రబాబు మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. బీజేపీ స్పష్టమైన నిర్ణయం తీసుకున్నాకే కిషన్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేసి ఉంటారా అన్న దానిపై ఇరువురు నేతలు చర్చించుకొని ఉండొచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోపక్క.. ఈ నెల 20న విజయనగరం జిల్లాలో లోకేశ్ యువగళం యాత్ర ముగింపు కార్యక్రమం జరగనుంది. దీనికి పవన్ రావడంలేదని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు శనివారం ప్రకటన చేశారు. ఆ కార్యక్రమానికి పవన్ కూడా హాజరైతే టీడీపీకి మేలు జరుగుతుందని లోకేశ్ భావిస్తున్నారు. లోకేశ్ ఒత్తిడితో ముగింపు కార్యక్రమానికి పవన్‌ను ఆహ్వానించేందుకే చంద్రబాబు స్వయంగా పవన్ ఇంటికి వెళ్లినట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ వర్గాల కథనం మరోలా ఉంది. ఇరు పార్టీల సీట్ల సర్దుబాటు, రాష్ట్రమంతటా చంద్రబాబు– పవన్ ఉమ్మడిగా సభల ఏర్పాటుకు సంబంధించి ఇరువురు నేతలు చర్చించుకున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

అధికార వైఎస్సార్‌సీపీ ముందే రాజకీయం వేడెక్కించడంతో..

2024 ఎన్నికలకు మరికొద్ది నెలలే సమయం ఉండటంతో వైఎస్సార్‌సీపీని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుండి నడిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత మార్పులకు శ్రీకారం చుట్టారు. కొన్ని ప్రత్యేక నియోజకవర్గాల్లో కొత్తగా పార్టీ ఇన్‌చార్జిలను నియమిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ నేతృత్వంలోని జనసేన అభ్యర్థులని వెదుక్కోవాల్సిన పరిస్థితి. ఆ రెండు పార్టీ మధ్య సీట్ల సర్దుబాటు తొందరగా తేల్చాల్సిన పరిస్థితిని వైఎస్సార్‌సీపీ వారి ముందుంచింది. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు, పవన్ తాజా భేటీ జరిగి ఉంటుందని ఆ పార్టీల నేతలు భావిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



జనం.. జైత్రయాత్ర

కర్నూలు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో సామాజిక సాధికార యాత్రకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు

దళారుల దందా

- ఆరు గ్యారంటీ కార్డుల పేరుతో మోసం
- ఒక్కో కార్డుకు రూ.50 చొప్పున వసూలు
- ఇంటింటికెళ్లి కార్డులు తయారుచేసి ఇస్తున్న వైనం
- నియంత్రించడంలో అధికారుల విఫలం



అచ్చంపేటలోని సీఎస్‌సీ సెంటర్ వద్ద గుమ్మిగూడిన జనం (ఫైల్)



నకిలీ కార్డులు

అచ్చంపేట రూరల్: ''రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలు మీకు వర్తించాలంటే కచ్చితంగా ఈ కార్డులు ఉండాల్సిందే.. లేదంటే మీకు పథకాలు వర్తించవు.. కేవలం రెండు నిమిషాల్లోనే మీ పేరు మీద కార్డు ఇస్తాం.. ఒక్కో కార్డుకు కేవలం రూ.50 మాత్రమే.. మళ్లీ సర్వర్ రాదు.. ముందుగా కార్డు తీసుకున్న వారికే ప్రాధాన్యం ఉంటుంది.. లేకుంటే మీ ఇష్టం సుమా..'' అంటూ కొందరు దళారులు గ్రామాల్లో తిరుగుతున్నారు. సెల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్, వేలిముద్రకు సంబంధించిన యంత్రం, ప్రింటింగ్ మిషన్, ల్యామినేషన్ మిషన్ వెంట పెట్టుకుని నకిలీ కార్డులు ఇస్తూ కొత్త దందాకు తెరలేపారు. అమాయక ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాల పేరుతో కార్డులిస్తూ మోసం చేస్తున్నారు. ఒక్కో కార్డుకు రూ.50 చొప్పున రూ.300 వరకు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని..

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిందో లేదో దళారులు కొత్త దందాకు తెరలేపారు. ప్రజల అమాయకత్వాన్ని దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం అమలుచేసే ఆరు గ్యారంటీల పేరుతో బోగస్ గుర్తింపు కార్డులు ఇస్తూ సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. కార్డుపై పేరు, ఫోన్ నంబర్ రావడంతో నిజమైన కార్డులేనని ప్రజలు భావిస్తున్నారు. ఈనెల 11న అచ్చంపేటలోని లక్ష్మి కంప్యూటర్స్, సీఎస్‌సీ నిర్వాహకుడు ఇలాగే నకిలీ కార్డులు తయారు చేసి, ప్రజలకు ఇస్తుంటే కొందరు నిలదీశారు. ఈ కార్డులు ఎవరు ఇవ్వమన్నారని అడిగితే సమాధానం చెప్పకుండా దుకాణం మూసివేయడం గమనార్హం.

గుట్టుచప్పుడు కాకుండా..

కొన్ని మీసేవ కేంద్రాలు, సీఎస్‌సీ, జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లలో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ కార్డులను అందిస్తున్నారు. పలు చోట్ల సెంటర్లపై కేసులు నమోదవుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లోనూ దందా షురూ అయ్యింది. ఇంటింటికెళ్లి కార్డులు తయారు చేసి ఇస్తున్నారు. కొన్ని నకిలీ వెబ్‌సైట్ల ద్వారా బోగస్ కార్డులిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్డులపై క్యూఆర్ కోడ్, స్థానిక ఎమ్మెల్యే ఫొటోలు, లబ్ధిదారు పేరు, ఫోన్ నంబర్లు ఉంటున్నాయి. వివిధ పథకాలకు అర్హులు కావాలంటే ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ మార్చుకోవాలని, రేషన్ కార్డుల్లో పేర్లు నమోదు చేసుకోవాలంటూ మభ్యపెడుతున్నారు. ఆధార్ కార్డులో పేరు, ఊరు, పుట్టిన తేదీలను మార్చడానికి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా.. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా సెంటర్ల నిర్వాహకులకు మద్దతుగా ఉండటంతో ఇంకా రెచ్చిపోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుందని తెలుస్తోంది. బహిరంగంగా ఇంత తతంగం నడుస్తున్నా పోలీసుల చర్యలు కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

గుర్తించాల్సిన విషయాలు..

కొత్త పథకాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఒకవేళ దరఖాస్తు చేసుకోవాలంటూ ఎవరైనా చెప్తే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్లి నిర్ధారించుకోవాలి. పథకాల అమలుకు ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేసి, అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేస్తుంది. దరఖాస్తు గడువు తేదీలను అధికారికంగా ప్రకటిస్తుంది. అధికారులు ప్రత్యేకంగా సమాచారం ఇస్తారు. పథకాలకు అర్హత పొందాలంటే ముందుగా ఎలాంటి ధ్రువపత్రం తీసుకోవాల్సిన అవసరం లేదు.

మోసం చేయడం తగదు..



కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలు చాలా బాగున్నాయి. దళారులు నకిలీ కార్డులు అందిస్తూ మోసం చేయడం తగదు. ఇలాంటి వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ అధికారులు ఈ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.
– సుధాకర్, అమ్రాబాద్ మండలం

ఫిర్యాదులు అందలేదు

ఆరు గ్యారంటీల నకిలీ కార్డులపై ఎవరూ ఇప్పటి వరకు ఫిర్యాదులు ఇవ్వలేదు. ఒకవేళ ఫిర్యాదులు అందితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.
– గోవర్ధర్, ఎస్ఐ, అచ్చంపేట

చెంచులకు గృహోపకరణాల పంపిణీ

మన్ననూర్: నల్లమల అటవీ లోతట్టు ప్రాంతమైన లింగాల మండలం మేడిమల్కల చెంచుపెంటలో ఆదివారం తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సామాజిక బాధ్యత బృందం ఆధ్వర్యంలో గృహోపకరణాలను పంపిణీ చేశారు. పెంటలోని 26 చెంచు కుటుంబాలకు నీళ్ల బిందెలు, వంట పాత్రలు, బకెట్లు, దుప్పట్లు, చిన్నారులకు ఆటబొమ్మలు, క్రీడాసామగ్రి, నిత్యవసరాలను అప్పాపూర్ సర్పంచ్ బాలగురువయ్య సమక్షంలో అందజేశారు. చెంచుపెంట పెద్ద బయ్యన్న, టీఎస్ ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, 1104 యూనియన్ నాయకులు అరుణ్‌కుమార్, సర్వేశ్వర్, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, మహేష్, వేణుగోపాల్, డేవిడ్, మనోహర్, రాజు పాల్గొన్నారు.



గృహోపకరణాలు పంపిణీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

అట్టహాసంగా..



తలపడుతున్న హైదరాబాద్, మహబూబ్‌నగర్ బాలికల హాకీ జట్లు

- రాష్ట్రస్థాయి హాకీ, ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- ఉమ్మడి 10 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు
- హాకీలో అత్యధిక స్కోర్‌తో అదరగొట్టిన పాలమూరు

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాలకృష్ణయ్య క్రీడా మైదానంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల రాష్ట్రస్థాయి హాకీ, అండర్-14 బాలికల ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు ఉమ్మడి 10 జిల్లాల జట్లు తరలివచ్చాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. అంతకుముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హాకీ టోర్నీలో తొలిరోజు ఏడు జట్లు తలపడ్డాయి. మహబూబ్‌నగర్ జట్టు ప్రతి మ్యాచ్‌లోనూ అత్యధిక స్కోర్‌తో పైచేయి సాధించి, సత్తా చాటింది. రంగారెడి, మెదక్ జట్ల మధ్య జరిగిన పోరులో 2-1 స్కోర్‌తో రంగారెడ్డి గెలుపొందింది. వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, కరీంనగర్ జట్ల మధ్య వేర్వేరుగా జరిగిన రెండు మ్యాచ్‌లు 1-1తో డ్రాగా ముగిశాయి. ఖమ్మం నల్గొండ జట్ల మధ్య జరిగిన పోరులో 6-0 స్కోర్‌తో నల్గొండ ముందంజలో నిలిచింది. హైదరాబాద్, ఆదిలాబాద్ జట్లు తలపడగా, 4-1 స్కోర్‌తో ఆదిలాబాద్ సత్తా చాటింది. అనంతరం ఖమ్మం, మహబూబ్‌నగర్ జట్లు పోటీపడగా 10-0 స్కోర్‌తో మహబూబ్‌నగర్ పైచేయి సాధించింది. చివరి మ్యాచ్‌లో కరీంనగర్, మెదక్ జట్లు పోటీలోకి దిగగా 2-0 స్కోర్‌తో కరీంనగర్ గెలుపొందింది.

బాలికల విభాగంలో..

బాలికల విభాగంలో ఆదిలాబాద్, వరంగల్ జట్లు తలపడగా 4-0స్కోర్‌తో వరంగల్ గెలుపొందింది. అనంతరం రంగారెడ్డి-నల్గొండ జట్లు పోటీపడగా 2-0 స్కోర్‌తో రంగారెడ్డి ముందంజలో నిలిచింది. హైదరాబాద్, కరీంనగర్ జట్ల మధ్య జరిగిన పోరులో 5-0 స్కోర్‌తో కరీంనగర్ సత్తా చాటింది. మెదక్, ఖమ్మం మధ్య సాగిన పోరులో 1-0 స్కోర్‌తో ఖమ్మం పైచేయి సాధించింది. కరీంనగర్, నల్గొండ జట్ల మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. మెదక్, నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలో 9-0తో నిజామాబాద్‌కు విజయం వరించింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ పోటీపడగా 6-0తో మహబూబ్‌నగర్ సత్తా చాటింది.

ఫుట్‌బాల్ టోర్నీలో..

అండర్-14 బాలికల ఫుట్‌బాల్ టోర్నీలో రంగారెడ్డి, నిజామాబాద్ జట్ల మ్యాచ్ 1-1 స్కోర్‌తో డ్రాగా ముగిసింది. నల్గొండ, కరీంనగర్ జట్లు పోటీపడగా 7-0తో నల్గొండ జట్టు విజయం సాధించింది. వరంగల్, మెదక్ జట్ల మధ్య జరిగిన పోరులో 6-0 స్కోర్‌తో మెదక్ గెలుపొందింది. ఖమ్మం, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన పోటీలో 1-0 స్కోర్‌తో ఖమ్మం గెలిచింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్ జట్లు పోటీపడగా 0-0తో డ్రాగా ముగిశాయి. ఆదిలాబాద్, నల్గొండ జట్లు తలపడగా 1-0 స్కోర్‌తో ఆదిలాబాద్ గెలుపొందింది.

జాతీయ స్థాయిలో రాణించాలి

- ఎమ్మెల్యే మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

క్రీడాకారులు క్రీడానైపుణ్యం, మెళకువలు ప్రదర్శిస్తూ జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆకాంక్షించారు. హాకీ వనపర్తికి పెట్టింది పేరని, ఎందరో క్రీడాకారులు ప్రతిభావంతులుగా ఎదిగారని గుర్తుచేశారు. విద్యా, వైద్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. వనపర్తి బాలుర ఉన్నత పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు వేగవంతంగా చర్యలు చేపడతామన్నారు. విద్యారంగం విషయంలో నిర్లక్ష్య దోరణికి చోటు ఉండదని స్పష్టం చేశారు. రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధికి కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆటలతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని చెప్పారు. విద్యార్థుల జీవితంలో ఆటలు ఓ భాగం కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు బ్రహ్మం, మహేష్, సత్యంసాగర్ డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, పీడీలు కుమార్, తిరుపతి, నిరంజన్‌గౌడ్, కేజర్‌బాబా, శ్రీదేవి, ఈశ్వరమ్మ, రంగనాయకమ్మ, రమేష్, వహీద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న నాగం జనార్ధన్‌రెడ్డి

కందనూలు: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేయాలని, లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని.. కొందరు నాయకులు, కార్యకర్తలు ఇంకొంత మెరుగ్గా పనిచేసి ఉంటే నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించేవారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓడినా ప్రజలకు అందుబాటులో ఉంటామని, ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు చెందిన నాయకుడని.. 'పాలమూరు' ఎత్తిపోతల పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కృష్ణా, గోదావరి జలాల హక్కుల సాధనకు కృషి చేసి మన వాటాను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, అందుకుగాను జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించి 30 ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీకి లేని శక్తిని కూడగట్టి నియోజకవర్గంలో బలోపేతం చేస్తే తనకు టికెట్ కేటాయించకుండా ప్యారచూట్ నేతలకు ఇచ్చి అన్యాయం చేయడంతో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వివరించారు. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు ప్రభుత్వానికి కొంతకాలం సమయమిచ్చి అప్పటికీ అమలు చేయకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, లక్ష్మయ్య, బాలాగౌడ్, కుర్మయ్య, కృష్ణారెడ్డి, సంతోష్‌రావు, భీముడు, అహ్మద్‌పాషా, సత్యం, వెంకటస్వామి, డిష్‌రాజు పాల్గొన్నారు.